Follow: @ANNTELUGU
REGISTERED NUMBER: APTEL/2014/58382
04-08-2025
ANN తెలుగు
# మహా పత్రిక
తిరుపతి, హైదరాబాద్ సంపుటి- 22 సంచిక- 241 పేజీలు-04 వెల-రూ.6
PUBLISHED FROM TIRUPATI | HYDERABAD సోమవారం WWW.EPAPER.MAHAADAILY.COM



## సీఎం రేవంత్‌ను కలిసిన మెగాస్టార్ చిరంజీవి

**హైదరాబాద్, మహా:** టాలీవుడ్ మెగాస్టార్ చిరంజీవి తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సమావేశం జూబ్లీహిల్స్‌లోని సీఎం అధికార నివాసంలో జరిగింది.సీఎంఓ కార్యాలయం ఈ భేటీకి సంబంధించిన వీడియోను 'ఎక్స్' (ట్విట్టర్) లో షేర్ చేసింది. చిరంజీవి సీఎం నివాసానికి వెళ్లిన దృశ్యాలు అక్కడి భద్రతా సిబ్బంది మధ్య ఓ ప్రత్యేకతను తీసుకొచ్చాయి. అధికారికంగా ఇదో శుభాకాంక్షల భేటీగా పేర్కొన్నప్పటికీ, దీని వెనుక సినిమారంగ సమస్యల చర్చే ఉందనే ఊహాగానాలు ఊపందుకున్నాయి.తెలుగు ఫిల్మ్ ఇండస్ట్రీలో పలు సమస్యలు కొనసాగుతున్న నేపథ్యంలో చిరు ఈ భేటీకి వెళ్లడం విశేషంగా మారింది. ముఖ్యంగా కార్మికుల సమ్మె వేళ జరగడం దీనికి మరింత ప్రాధాన్యతను ఇచ్చింది. ఇటీవల తెలుగు సినీ కార్మికుల ఫెడరేషన్ భారీ సమ్మెకు పిలుపునిచ్చింది. పలు డిమాండ్లు నెరవేర్చాలని వారు ఒత్తిడి చేస్తున్నారు.ఈ సమయంలో చిరంజీవి వంటి బడా స్టార్ స్వయంగా సీఎంను కలవడం సినీ వర్గాల్లో చర్చనీయాంశమైంది. పరిశ్రమలో పరిస్థితులు మరింత ఉత్కంఠంగా మారుతున్న తరుణంలో ఈ భేటీ సంభవించడం ఉద్దేశపూర్వకమనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి.

**టాప్ న్యూస్**

### మేఘా కమిషన్ల కోసమే కాళేశ్వరం
- మంత్రి వివేక్ ఫైర్

02



### బనకచర్ల పాపం బీఆర్ఎస్ దే
- ఏపీ ప్రభుత్వ కుట్రలు, కుతంత్రాలను అడ్డుకుని తీరుతాం
- రాజకీయాల కంటే రాష్ట్ర ప్రయోజనాలే మాకు ముఖ్యం
- పదేళ్లలో వారు చేసిందేం లేదు... తప్పులను సరిదిద్దుతున్నాం
- రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క

03



### జూబ్లీహిల్స్ ఉప ఎన్నికను అంత ఈజీగా తీసుకోవద్దు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

02



SRI GOLD
TRUSTED GOLD BUYERS

**బంగారం ధరలు**

| | |
|---|---|
| 24 క్యారెట్ | 99,930 |
| 22 క్యారెట్ | 91,600 |
| సిల్వర్ (కేజీ) | 1,16,000 |



# కిషన్ రెడ్డే.. ఈ రాష్ట్రానికి శని

## బీసీ బిల్లుకు అడ్డం పడుతుంది ఆయనే...

- సికింద్రాబాద్‌లో బీసీ మద్దతు లేకుండా ఎట్ల గెలుస్తావో చూస్తాం
- బీసీ బిల్లు కోసం ఢిల్లీలో తడాఖా చూపుతాం
- రెండేళ్ళలో లక్షా75వేల కోట్ల పెట్టుబడులు తెచ్చిన ఘనత రేవంత్ దే
- వచ్చే ఎన్నికల్లో వంద సీట్లు గెలుస్తాం.. ఆదిలాబాద్ సాక్షిగా చెబుతున్నా
- ప్రత్యేకవ్యూహంతో ఆదిలాబాద్ జిల్లాను క్లీన్ స్వీప్ చేస్తాం
- జనహిత యాత్రలో టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్
- జనజాతరలా తొలివిడత జనహిత యాత్ర.. క్యాడర్ లో జోష్

**ఖానాపూర్, మహా:**

తెలంగాణ రాష్ట్రప్రగతికి, బీసీ బిల్లుకు కిషన్ రెడ్డి శనిలా అడ్డం తగులుతున్నారని టీపీసీసీ చీఫ్ మహేష్ ఫైరయ్యారు. తెలంగాణ ప్రభుత్వం కులగణన చేసి బీసీ బిల్లును అసెంబ్లీలో ఆమోదింపజేసి ఢిల్లీకి పంపిందని, ఢిల్లీలో బిల్లును తొక్కిపెట్టి బీసీలకు రిజర్వేషన్లు రాకుండా బీజేపీ నేతలు కుట్రలు చేస్తున్నారన్నారు. తెలంగాణ బీసీ బిల్లుపంపగానే ప్రధాని మోదీ, అమిత్ షాలు మాట్లాడడం లేదని.. కిషన్ రెడ్డి దొంగనాటకాలు ఆడుతున్నారని విమర్శించారు. బిజెపి చీఫ్ రామచందర్ రావు బిసిలకు రిజర్వేషన్లు ఎలా వస్తాయో చూస్తామంటున్నారని, వీరికి ప్రజలే బుద్ధిచెబుతారన్నారు. నిర్మల్ జిల్లా లోని ఖానాపూర్‌లో కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన జనహిత పాదయాత్రలో ఏఐసీసీ జాతీయ కార్యదర్శి మీనాక్షి నటరాజన్, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇంచార్జ్ జూపల్లి కృష్ణారావు, మంత్రి సీతక్క ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, ముఖ్య నేతలు శ్రీహరిరావు, కంది శ్రీనివాసరెడ్డితో సహా పలువురు పాల్గొన్నారు.

మిగతా 2లో

# కేసీఆర్, హరీష్, ఈటలకు అరెస్ట్ గండం?

## కేసీఆర్.. హరీష్ రావుల ఆదేశాల ప్రకారమే నిర్మాణాలు

### కేసీఆర్ హరీష్ గుడ్డిగా సూచించారు

- తెలిసినా రాజేందర్ నిధులపై నిర్లక్ష్యంగా వ్యవహరించారు
- ఇరిగేషన్ శాఖ పంపిన అంచనాలకు గుడ్డిగా ఆమోదం తెలిపారని నివేదిక
- ఆర్థిక శాఖ చేయాల్సిన కనీస బాధ్యతలు నిర్వహించలేదన్న కమిషన్
- ముగ్గురిపై క్రిమినల్ ప్రాసిక్యూషన్ కు కమిషన్ సూచన
- కమిషన్ పై వేసిన కమిటీతో సీఎస్ భేటీ
- నేడు తెలంగాణ కేబినెట్ లో సంచలన నిర్ణయాలు



**హైదరాబాద్, మహా:**

తెలంగాణ రాష్ట్ర రాజకీయాల్లో సంచలనాలు చోటుచేసుకోబోతున్నాయి. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో జరిగిన తప్పులు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ తో పాటు మంత్రులుగా పనిచేసిన హరీష్ రావు, ఈటల రాజేందర్ ల మెడకు చుట్టుకుంటున్నాయి. కాళేశ్వరం పై నియమించిన జస్టిస్ ఘోష్ కమిషన్ స్పష్టమైన సూచనలు చేయడం, వీటిపై అధ్యయనం చేసిన అధికారుల కమిటీ కేబినెట్ ముందు ఉంచేందుకు కీ పాయింట్స్ తయారు చేసి సీఎస్ తో భేటీ కావడంతో.. సోమవారం సంచలనాలు చోటుచేసుకునే అవకాశాలున్నాయి. కాళేశ్వరం కమిషన్ పై అధికారుల అధ్యయనం ముగియగా, ప్రాజెక్టు నిర్మాణం లో భాగస్వామ్యం అయిన అందరి గురించి నివేదికలో కమిషన్ పేర్కొంది. ప్రధానంగా కేసీఆర్... హరీష్.. ఈటెల పాత్రల పైనా నివేదిక లో పేర్కొంది.

మిగతా 2లో



## స్మార్ట్ ఫోన్ ఎగుమతుల్లో భారత్ ప్రభంజనం
- మూడు మాసాల్లో రూ.64,500 కోట్ల విలువైన ఫోన్ల ఎగుమతి
- ఎలక్ట్రానిక్స్ రంగం పరుగులు

**మహా :** ఎలక్ట్రానిక్స్ రంగం పరుగులు పెడుతోంది. భారతదేశం నుంచి స్మార్ట్‌ఫోన్ల ఎగుమతులు సరికొత్త శిఖరాలకు చేరాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో (ఏప్రిల్‌జూన్) దేశం నుంచి రికార్డు స్థాయిలో ఎగుమతులు నమోదైనట్లు నివేదికలు స్పష్టం చేస్తున్నాయి.

మిగతా 3లో

**స్టాక్ మార్కెట్**

| | |
|---|---|
| సెన్సెక్స్ ↗ | 80,599.91 |
| నిఫ్టీ ↗ | 24,565.35 |

**ఈరోజు చికెన్ ధరలు**

| | చికెన్ | స్కిన్ లెస్ | బోన్ లెస్ |
|---|---|---|---|
| 1 కేజీ రిటైల్ ధర | 180 | 220 | 230 |
| హోల్ సేల్ ధర | 160 | 200 | 210 |

**ఈరోజు గుడ్డు ధరలు**

| | 1 పీస్ | ట్రే |
|---|---|---|
| ఎన్ఈసీసీ గుడ్డు ధర | 4.3 | 129 |
| హోల్ సేల్ గుడ్డు ధర | 4.3 | 129 |
| రిటైల్ గుడ్డు ధర | 4.64 | 139.32 |

# ఎవరు మీరంతా?

## కేసీఆర్ లేకుంటే మీరెక్కడ?

- నల్లగొండ జిల్లాలో పార్టీని నాశనంచేసిన నాయకుడు నన్నంటాడా?
- సూర్యాపేటలో ఆయన చావుతప్పి గెలిచాడు
- లిల్లీపుట్ నాయకుడు.. నా గురించి మాట్లాడడమేంటి?
- ఇంటి ఆడబిడ్డపై వ్యాఖ్యలు చేస్తే బీఆర్ఎస్ నేతలు కనీసం స్పందించలేదు
- మల్లన్న వ్యాఖ్యల వెనుక చాలా పెద్దనాయకుడు ఉన్నాడు
- నా దగ్గర కోవర్టులను పెట్టానని సంబరపడుతున్నాడు.. ఆయన దగ్గర కూడా నావాళ్ళు
- బీఆర్ఎస్ నేతలపై ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సంచలన వ్యాఖ్యలు
- 72గంటల దీక్ష చేసి తీరుతా

**హైదరాబాద్, మహా :**

ఒక ఆడ బిడ్డగా నాపైన అనుచిత వ్యాఖ్యలు చేస్తే తెలంగాణ సమాజం మొత్తం రియాక్ట్ అయ్యారు కానీ, బీఆర్ఎస్ పార్టీ, నేతలు స్పందించకపోవడం దారుణం. అది వారి విజ్ఞతకే వదిలేస్తున్నా. మల్లన్న చేసిన వ్యాఖ్యల వెనుక బీఆర్ఎస్ కు చెందిన చాలా పెద్దనాయకుడు ఉన్నాడు. చాలా ఆధారాలతో నిర్ధారణ చేసుకుని ఈ విషయం చెబుతున్నా అని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆదివారం మీడియా సమావేశంలో మాట్లాడుతూ తనను కించపరిచే విధంగా మాట్లాడితే వెనక్కు తగ్గుతానని భావించారని, అలాంటిదేం లేకపోవడంతో నేతలు ఖంగు తిన్నారన్నారు.

మిగతా 2లో



## బర్త్‌డే పార్టీలో డ్రగ్స్

### ఆరుగురు ఐటీ ఉద్యోగుల అరెస్ట్

**చేవెళ్ల, మహా :** రంగారెడ్డి జిల్లా చేవెళ్లలో డ్రగ్స్ కలకలం రేగింది. సెరీన్ ఆచార్జ్ ఫామ్‌హౌస్‌లో డ్రగ్స్, విదేశీ మద్యంతో ఐటీ ఉద్యోగులు బర్త్‌డే వేడుకలు చేసుకున్నారు. పక్కా సమాచారంతో ఫామ్‌హౌస్‌లో పోలీసులు సోదాలు చేపట్టారు. రూ.రెండు లక్షల విలువైన డ్రగ్స్‌తో పాటు 3 కార్లను స్వాధీనం చేసుకున్నారు. బర్త్‌డే వేడుకల్లో పాల్గొన్న వారికి డ్రగ్స్ టెస్ట్ నిర్వహించారు. ఆరుగురు ఐటీ ఉద్యోగులకు పాజిటివ్ రావడంతో పోలీసులు వారిని అరెస్ట్ చేశారు.

## కవిత గురించి మాట్లాడటం వృథా

### జగదీశ్ రెడ్డి షాకింగ్ కామెంట్స్

- కవితమ్మకు నా ఉద్యమ ప్రస్థానంపై ఉన్న జ్ఞానానికి నా జోహార్లు
- కేసీఆర్ శత్రువుల మాటలే వల్లె వేస్తున్నారు
- నేను చావుతప్పి గెలిచా.. కానీ కొందరు గెలవలేదు కదా

**హైదరాబాద్, మహా :** బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. తన ఉద్యమ ప్రస్థానానికి సంబంధించి కవితకు ఉన్నజ్ఞానానికి జోహార్లు అని ఎద్దేవా చేశారు.

మిగతా 2లో



### బనకచర్లపై ఎంతవరకైనా పోరాడుతాం

#### ప్రాజెక్టును ఎట్టి పరిస్థితుల్లోనూ కట్టనివ్వం

- ఈ విషయంలో ప్రభుత్వం రాజీ పడే ప్రసక్తే లేదు
- ముఖ్యమంత్రి భేటీలో మా వాదనలు గట్టిగా వినిపించాం
- నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి
- పెద్దపలిలో రేషన్ కార్డుల పంపిణీ, ఐటీఐ కళాశాల భవన నిర్మాణానికి శంకుస్థాపన
- పాల్గొన్న మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, అడ్లూరి లక్ష్మణ్, పొన్నం ప్రభాకర్

02




## జూబ్లీహిల్స్ ఉపఎన్నికను అంత ఈజీగా తీసుకోవద్దు

### బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**హైదరాబాద్, మహా :** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికను అంత ఈజీగా తీసుకోవద్దని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పార్టీ శ్రేణులకు సూచించారు. ఆదివారం తెలంగాణభవన్ లో జరిగిన డివిజన్ల సమావేశాల్లో కేటీఆర్ పాల్గొన్నారు. "మాగంటి గోపీనాథ్ అకాల మరణం చాలా బాధాకరం. అనుకోకుండా వచ్చిన ఉప ఎన్నికలో పార్టీ అభ్యర్థిని గెలిపించుకోవాలి. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో క్లాస్, మాస్ అందరూ ఉంటారు. హైదరాబాద్‌లో లక్ష మంది పేదలకు జీవో 58, 59 కింద పట్టాలు ఇచ్చింది కేసీఆర్ ప్రభుత్వం. అసెంబ్లీ ఎన్నికల్లో హైదరాబాద్‌లో కాంగ్రెస్ ఒక్క సీటు కూడా గెలవలేదు. పేద వారికి మాత్రమే హైడ్రా నిబంధనలు వర్తిస్తాయా? సన్న బియ్యంతో విద్యార్థులకు అన్నం పెట్టింది.. కేసీఆర్ ప్రభుత్వమే. తెలంగాణలో మతం పేరుతో కేసీఆర్ రాజకీయం చేయలేదు. 20 నెలల కాంగ్రెస్ పాలనలో ఒక్క మంచి పని కూడా చేయలేదు. నూరు రోజుల్లో ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని ప్రజలను మోసం చేశారు" అని కేటీఆర్ విమర్శించారు. సమావేశంలో గోపినాథ్ సతీమణి సునిత, పార్టీ నేతలు పాల్గొన్నారు.

# కిషన్ రెడ్డే ఈ రాష్ట్రానికి శని

(మొదటిపేజీ తరువాయి)

ఈ సందర్భంగా మహేష్‌గౌడ్ మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో వందకు పైగా సీట్లతో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని, ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాలో అన్ని సీట్లు గెలుస్తామన్నారు. ఆదిలాబాద్ జిల్లాపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, తమకు ప్రత్యేక వ్యూహం ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ప్రతీమాట నిలుపుకుంటుందన్నారు. తెలంగాణ ఇచ్చింది కాంగ్రెస్ పార్టీ అన్నారు. ఇచ్చిన మాట కోసం ఎన్ని ఇబ్బందులు ఎదురైనా నెరవేర్చేది కాంగ్రెస్ పార్టీ అన్నారు. దేశానికి తెలంగాణ ఇపుడు రోల్ మోడల్ గా నిలిచిందని, కులగణన ద్వారా బీసీలు 56.7శాతం ఉన్నట్లు నిర్ధారించామని, కామారెడ్డి డిక్లరేషన్ లో చెప్పినట్లు బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ అసెంబ్లీలోనే బిల్లు చేశామన్నారు. కేంద్రానికి బీసీలపై ప్రేమ లేదన్నారు. ఢిల్లీలో బీసీ బిల్లు కోసం ధర్నా చేయడంతో పాటు రాష్ట్రపతిని కూడా కలవబోతున్నామని, కేంద్రం దిగిరాకుంటే బీసీల చేతిలో బిజెపి అడ్రస్ గల్లంతవుతుందన్నారు. తెలంగాణ ప్రభుత్వ పాలనపై



ప్రజా స్పందన తెలుసుకుని, మరిన్ని ప్రజాహిత నిర్ణయాలు తీసుకునేందుకే ఈ జనహిత యాత్ర చేపట్టామన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆరుగ్యారంటీల్లో చాలా వరకు నెరవేర్చామన్నారు. ఆర్థిక పరిస్థితి సహకరించకున్నా ఈ ప్రభుత్వం ఎంతో కష్టపడి పనిచేస్తున్నదన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 20 మాసాల్లోనే లక్షా 75వేల కోట్ల పెట్టుబడులు తీసుకొచ్చారని, కేటీఆర్ పదేళ్ళలో 25వేల కోట్ల పెట్టుబడులు తేలేకపోయారన్నారు. బీజేపీకి ఎన్నికలంటే శ్రీరాముడు గుర్తుకొస్తాడని, శ్రీరాముడికి బిజెపికి ఏం సంబంధమన్నారు.

**జనజాతరలా యాత్ర**

తెలంగాణ పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ నాయకత్వంలో చేపట్టిన మొదటి విడత "జనహిత పాదయాత్ర - శ్రమదానం" ఉత్సాహభరిత వాతావరణంలో ముగిసింది. ఖానాపూర్ పాదయాత్రకు జిల్లా నలుమూలల నుండి పెద్ద ఎత్తున కాంగ్రెస్ శ్రేణులు తరలిరాగా, నేతల్లో ఉత్సాహం నెలకొంది, రంగారెడ్డి జిల్లా పరిగి నుంచి ప్రారంభమైన ఈ పాదయాత్ర, శ్రమదానం కార్యక్రమాలు ఆదిలాబాద్ జిల్లా ఖానాపూర్‌లో ముగిసాయి. ఈ పాదయాత్రలో టీపీసీసీ చీఫ్‌తోపాటు ఏఐసీసీ తెలంగాణ వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్, జిల్లా ఇంచార్జ్ మంత్రులు, జిల్లా మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, డీసీసీ అధ్యక్షులు, టీపీసీసీ కార్యవర్గ నాయకులు కూడా పాల్గొన్నారు. నాలుగు రోజుల పాటు ఉమ్మడి రంగారెడ్డి, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాల్లో సాగిన యాత్రకు, శ్రమదానం కార్యక్రమాలకు ప్రజల నుంచి విశేష స్పందన లభించింది.

## కేసీఆర్, హరీష్, ఈటలకు అరెస్ట్ గండం?

(మొదటిపేజీ తరువాయి)

బాధ్యులందరిపై క్రిమినల్ ప్రాసిక్యూషన్ చేయాలని కమిషన్ సూచించినట్లు తెలిసింది. కాళేశ్వరం ప్రాజెక్టు లో మేడిగడ్డ..అన్నారం లొకేషన్ అంతా కేసీఆర్ ఆలోచనేనని కమిషన్ విచారణలో తేలింది. కేసీఆర్.. హరీష్ రావుల ఆదేశాల ప్రకారమే నిర్మాణాలు నిబంధనలు, నాణ్యతతో సంబంధం లేకుండా జరిగాయని నివేదికలో పేర్కొన్నట్లు ప్రచారముంది. లొకేషన్ ల విషయంలో కేసీఆర్ చొరవే ఎక్కువని కమిషన్ పేర్కొన్నట్లు తెలిసింది. ప్రాజెక్టు నిర్మాణం లో టెక్నాలజీ వ్యవహారం లో మంత్రిగా హరీష్ లోటుపాట్ల ను కమిషన్ స్పష్టంగా సూచించినట్లు తెలిసింది.

**ఈటలకు చిక్కులు**

ఆర్థిక శాఖ... అధికారుల లోపాల పై కమిషన్ ఫోకస్ పెట్టినట్లు తెలిసింది. ఇరిగేషన్ శాఖ పంపిన అంచనాలను గుడ్డిగా ఆమోదం తెలిపారని నివేదికలో పేర్కొన్నట్లు తెలిసింది. ఆర్థిక శాఖ చేయాల్సిన కనీస బాధ్యతలు నిర్వహించలేదని కమిషన్ అభిప్రాయపడ్డట్లు తెలిసింది. ఇప్పటికే కాళేశ్వరం వ్యవహారంలో పార్టీ లైన్ కు భిన్నంగా కేసీఆర్ ను సమర్థించి చిక్కుల్లో పడ్డ ఈటల రాజేందర్ ఇపుడు కమిషన్ నివేదికతో మరిన్ని సమస్యల్లో పడ్డారు. క్రిమినల్ ప్రాసిక్యూషన్ కు కమిషన్ సిఫార్సు చేసినట్లు ప్రచారం ఉండగా, బీఆర్ఎస్ పెద్దలతో పాటు ఈటలకు కూడా కేసు, విచారణలు తప్పవన్న విశ్లేషణలు వినబడుతున్నాయి. సోమవారం కేబినెట్ భేటీలో దీనిపై సుదీర్ఘంగా చర్చించనున్నారు. కేసులు, విచారణపై కమిషన్ చేసిన సిఫార్సులను అమలుచేస్తారా? లేక అసెంబ్లీలో చర్చకు పెట్టి.. ఎటూ తేల్చకుండా వదిలేస్తారా అన్న అంశాలపై రకరకాల విశ్లేషణలు సాగుతున్నాయి.

## మేఘా కమిషన్ల కోసమే కాళేశ్వరం

### మంత్రి వివేక్ ఫైర్

**హైదరాబాద్, మహా :**

కాళేశ్వరం ప్రాజెక్టు వ్యవహారంలో జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదిక ఆధారంగా మంత్రి వివేక్ వెంకటస్వామి కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ ప్రాజెక్టు నిర్మాణంలో నిర్ణయాలు తీసుకున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టును మేఘా ఇంజనీరింగ్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్ (ఎంఈఐఎల్) సంస్థకు కమిషన్ల కోసమే అప్పజెప్పిందని ఆరోపించారు. దీని కోసం రూ. 1 లక్ష కోట్లకు పైగా ఖర్చు చేసినప్పటికీ రాష్ట్ర ప్రజలకు ఎలాంటి ప్రయోజనం చేకూరలేదని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, మరియు సుందిళ్ల బ్యారేజీలలో నిర్మాణ లోపాలు, పిల్లర్లు కుంగిపోయిన నేపథ్యంలో, ఈ ప్రాజెక్టు నిర్మాణంలో అవినీతి, నిర్లక్ష్యం జరిగిందని కాంగ్రెస్ ప్రభుత్వం ఆరోపిస్తోంది.



**15నెలల విచారణ**

జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ 15 నెలల పాటు 119 మందిని విచారణ జరిపి, ఆగస్టు 1న 650 పేజీలతో కూడిన మూడు వాల్యూమ్‌ల నివేదికను ప్రభుత్వానికి సమర్పించింది. ఇందులో బ్యారేజీల నిర్మాణంలో శాస్త్రీయ పరీక్షలు జరపకపోవడం, మంత్రివర్గ ఆమోదం లేకుండా నిర్ణయాలు తీసుకోవడం, బీఆర్ఎస్ నాయకులైన మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రులు హరీశ్ రావు, ఈటల రాజేందర్‌లు కీలక పాత్రలు పోషించినట్లు ఆరోపించింది.

## ఎవరు మీరంతా?

### కేసీఆర్ లేకుంటే మీరెక్కడ?

నల్లగొండ జిల్లాలో పార్టీని నాశనంచేసిన నాయకుడు నన్నంటాడా?

సూర్యాపేటలో ఆయన చావుతప్పి గెలిచాడు

లిల్లీపుట్ నాయకుడు.. నా గురించి మాట్లాడడమేంటి?

ఇంటి ఆడబిడ్డపై వ్యాఖ్యలు చేస్తే బీఆర్ఎస్ నేతలు కనీసం స్పందించలేదు

మల్లన్న వ్యాఖ్యల వెనుక చాలా పెద్దనాయకుడు ఉన్నాడు

నా దగ్గర కోవర్టులను పెట్టానని సంబరపడుతున్నాడు.. ఆయన దగ్గర కూడా నావాళ్ళు

బీఆర్ఎస్ నేతలపై ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సంచలన వ్యాఖ్యలు

72గంటల దీక్ష చేసి తీరుతా



(మొదటిపేజీ తరువాయి)

తనను కించ పరిచే విధంగా మాట్లాడిన నేత వెనుక ఎవరున్నారన్న అంశంపై తన వద్ద ఆధారాలున్నాయని, ఆ ఆధారాలను సరైన సమయంలో బయటపెడుతానని అన్నారు. ఇంటి ఆడబిడ్డపై అసభ్యకరమైన వ్యాఖ్యలు చేస్తే బీఆర్ఎస్ సోదరులు కనీసం స్పందించలేదని మండిపడ్డారు. ఇదే సమయంలో బీఆర్ఎస్‌తో సంబంధం లేని వ్యక్తితో తనపై ఆరోపణలు చేయిస్తున్నారని మండిపడ్డారు. లిల్లీపుట్ నాయకుడు తనను విమర్శించమేంటని కవిత ప్రశ్నించారు. ఆయనే చచ్చీ చెడి సూర్యాపేటలో గెలిచాడు, అలాంటి వ్యక్తి తన గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. తన జిల్లాలో ఒక్కరిని కూడా గెలిపించుకోలేని అసమర్థ నేత. జిల్లాలో పార్టీ ని నాశనం చేసిన నాయకుడు అంటూ మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీష్ రెడ్డిని ఉద్దేశించి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. తన గురించి మాట్లాడిన నల్గొండ జిల్లాకు చెందిన నేత ఏనాడైనా ఉద్యమంలో పాల్గొన్నారా అని ప్రశ్నించారు. అసలు బీఆర్ఎస్‌తో మీకేం సంబంధం? అని జగదీష్ రెడ్డిని ఉద్దేశించి ప్రశ్నించారు. లిల్లీపుట్ నాయకుడు, నిన్న మొన్న వచ్చిన చోటా మోటా నాయకులు కూడా నాపై మాట్లాడుతున్నారని మండిపడ్డారు. కేసీఆర్ లేకుంటే ఎవరు వీరంతా అని ప్రశ్నించారు. నిన్నగాక మొన్న వచ్చిన పిలగాడు కూడా నామీద మాట్లాడుతున్నాడు. బాబు పెద్దోళ్ళ విషయాల్లోకి రాకు. మీమీదే తెలంగాణ ఉద్యమం చేసినం అంటూ మాజీ మంత్రి సబిత తనయుడు కార్తీక్ రెడ్డిని హెచ్చరించారు.

**72 గంటల దీక్ష చేసి తీరుతా...**

తెలంగాణలో 72 గంటల నిరాహార దీక్షకు ప్రభుత్వానికి, పోలీసులను అనుమతి కోరామని, ప్రభుత్వం అనుమతి విషయంలో ఎలాంటి స్పష్టత ఇవ్వలేదని ఎమ్మెల్సీ కవిత అన్నారు. ప్రభుత్వం నుంచి స్పందన రాకపోతే అనుమతి కోసం కోర్టుకు వెళ్తామన్నారు కోర్ట్ మాకు అనుమతి ఇస్తుంది అనే నమ్మకం ఉందన్నారు. గాంధేయ మార్గంలో దీక్ష చేస్తామని, సానుకూల దృక్పథంతో ప్రభుత్వం అనుమతి ఇవ్వాలని కవిత కోరారు. 42 శాతంలో ముస్లింలు ఉన్నారో లేదో ప్రభుత్వం ఇంత వరకు స్పష్టత ఇవ్వలేదని, ఈ విషయంలో బీసీలలో అనేక అనుమానాలున్న నేపథ్యంలో స్పష్టత ఇవ్వాలన్నారు. ఇదే సమయంలో ముస్లిం రిజర్వేషన్ల విషయంలో ఏం చేస్తారో ప్రభుత్వం చెప్పాల్సిన అలవసరం కూడా ఉందన్నారు. దొంగనే దొంగ అన్నట్టుగా బీజేపీ వాళ్ళ ధర్నా ఉందని కవిత వ్యాఖ్యానించారు. తన మూడు రోజుల దీక్షకు అనుమతి రాకపోతే ఇంట్లోనే దీక్ష చేస్తానని స్పష్టం చేశారు.

## కవిత గురించి మాట్లాడటం వృథా

### జగదీశ్ రెడ్డి షాకింగ్ కామెంట్స్

కవితమ్మకు నా ఉద్యమ ప్రస్థానంపై ఉన్న జ్ఞానానికి నా జోహార్లు

కేసీఆర్ శత్రువుల మాటలే వల్లె వేస్తున్నారు

నేను చావుతప్పి గెలిచా.. కానీ కొందరు గెలవలేదు కదా

(మొదటిపేజీ తరువాయి)

కేసీఆర్‌కు బద్ధ శత్రువులుగా ఉన్న వాళ్లు, బీఆర్ఎస్‌ను ఖతం చేయాలని చూస్తున్న వారు ఏం మాట్లాడుతున్నారో.. కవిత అదే మాట్లాడుతున్నారని జగదీశ్ రెడ్డి విమర్శించారు. " నా ఉద్యమ ప్రస్థానానికి సంబంధించి కవితమ్మకు ఉన్న జ్ఞానానికి నా జోహార్లు... కేసీఆర్ శత్రువులైన రేవంత్, రాధాకృష్ణ లు నా గురించి మాట్లాడిన మాటల్ని మరొక్కసారి వల్లే వేసేందుకు ఆమె చేసిన ప్రయత్నానికి నా సానుభూతిని తెలియజేస్తున్న " అంటూ ఆయన ట్విట్ చేశారు. నల్గొండ జిల్లాలో 25 ఏళ్లల్లో జరిగిన ఉద్యమాలు, గెలుపునకు తాను బాధ్యుడను అయితే ఓటమికి కూడా తానే బాధ్యుడనని.. పార్టీ అంతిమంగా ఫైనల్ అని జగదీశ్ రెడ్డి స్పష్టం చేశారు. వ్యక్తులుగా ఏదో చేస్తామని అంటే వారి భ్రమ అని ఎద్దేవా చేశారు. కొంతమంది ఏదో చేయాలని ఊహించుకుంటున్నారని విమర్శించారు. తాను పార్టీకి సైనికుడునని ఉద్ఘాటించారు. కేసీఆర్‌ను ఈ మధ్య కాలంలో తాను 50సార్లు కలిశానని గుర్తుచేశారు. కవిత



గురించి మాట్లాడటం వృథా అని విమర్శించారు.

**కేసీఆర్ లేకుంటే ఎవరూ లేం**

కేసీఆర్‌తో బనకచర్ల, వ్యవసాయ రంగానికి సంబంధించిన అంశాలపైనే చర్చించామని జగదీశ్ రెడ్డి క్లారిటీ ఇచ్చారు . కేసీఆర్ లేకపోతే ఎవరూ లేమని, అందులో ఎలాంటి సందేహం లేదని తేల్చిచెప్పారు. తాను చావు తప్పి కన్నులొట్ట బోయినట్లు ఎమ్మెల్యేగా గెలిచానని.. కానీ కొంతమంది గెలవలేదు కదా? అని ప్రశ్నించారు. కవితపై ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న చేసిన వ్యాఖ్యలు తన దృష్టికి రాలేదని చెప్పుకొచ్చారు. తన దృష్టికి వచ్చి ఉంటే స్పందించేవాడినని జగదీశ్ రెడ్డి పేర్కొన్నారు.

## స్మార్ట్ ఫోన్ ఎగుమతుల్లో భారత్ ప్రభంజనం

**మూడుమాసాల్లో రూ.64,500కోట్ల విలువైన ఫోన్ల ఎగుమతి**

**ఎలక్ట్రానిక్స్ రంగం పరుగులు**

(మొదటిపేజీ తరువాయి)

ఈ మూడు నెలల కాలంలోనే ఏకంగా 7.72 బిలియన్ డాలర్ల (దాదాపు రూ. 64,500 కోట్లు) విలువైన స్మార్ట్‌ఫోన్లు విదేశాలకు ఎగుమతి అయ్యాయి. గతేడాది ఇదే సమయంతో పోలిస్తే ఇది 58 శాతం అధికం కావడం విశేషం. ఈ భారీ వృద్ధిలో టెక్ దిగ్గజం యాపిల్ కీలక పాత్ర పోషించింది. మొత్తం స్మార్ట్‌ఫోన్ ఎగుమతుల్లో దాదాపు 78 శాతం వాటా ఒక్క యాపిల్ సంస్థదే కావడం గమనార్హం. తన కాంట్రాక్ట్ తయారీదారుల ద్వారా యాపిల్ ఏకంగా 6 బిలియన్ డాలర్ల విలువైన ఐఫోన్లను భారత్ నుంచి ఎగుమతి చేసింది. గతేడాది ఇదే త్రైమాసికంతో పోల్చితే యాపిల్ ఎగుమతులు 82 శాతం పెరిగాయి. భారతదేశ స్మార్ట్‌ఫోన్ల ఎగుమతుల చరిత్రలో ఒక త్రైమాసికంలో ఇంతటి వృద్ధి నమోదు కావడం ఇదే తొలిసారి. కేంద్ర ప్రభుత్వం 2020లో ప్రవేశపెట్టిన ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహక (పీఎల్ఐ) పథకం ఈ అద్భుతమైన ప్రగతికి ప్రధాన కారణంగా నిలుస్తోందని నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఈ పథకం ద్వారా దేశంలో స్థానిక తయారీ గణనీయంగా పెరిగింది. 2021 ఆర్థిక సంవత్సరంలో కేవలం 3.1 బిలియన్ డాలర్లుగా ఉన్న స్మార్ట్‌ఫోన్ ఎగుమతులు, 2025 నాటికి 24.1 బిలియన్ డాలర్లకు చేరాయి. ఇందులో 17.5 బిలియన్ డాలర్లు ఒక్క యాపిల్ వాటానే ఉంది. మొత్తంగా ఎలక్ట్రానిక్స్ రంగం పరుగులు పెడుతోంది.

## అవయవదానంలో ఆల్ఇండియా టాపర్‌గా తెలంగాణ

**వెల్లడించిన కేంద్ర ఆరోగ్యశాఖ**

**రాష్ట్రానికి నేషనల్ ఆర్గాన్ అండ్ టిష్యు ట్రాన్స్‌ప్లాంటేషన్ ఆర్గనైజేషన్ అవార్డు**

**హైదరాబాద్, మహా:** అవయవ దానంలో దేశంలోనే తెలంగాణ మొదటి స్థానంలో నిలిచింది. 2024లో ప్రతి పది లక్షల జనాభాకు దేశంలో సగటున 0.8 ఆర్గాన్ డొనేషన్స్ జరిగితే, తెలంగాణలో ప్రతి పది లక్షల జనాభాకు 4.88 డొనేషన్స్ జరిగాయని కేంద్ర ఆరోగ్యశాఖ వెల్లడించింది. అవయవదానంలో ప్రథమ స్థానంలో నిలిచినందుకుగానూ రాష్ట్రానికి నేషనల్ ఆర్గాన్ అండ్ టిష్యు ట్రాన్స్‌ప్లాంటేషన్ ఆర్గనైజేషన్ (ఎన్ఓటీటీఓ) అవార్డు ప్రకటించింది. శనివారం, ఢిల్లీలో జరిగిన జాతీయ అవయవదాన దినోత్సవ వేడుకల కార్యక్రమంలో కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి జేపీ నడ్డా జీవన్‌దాన్ ప్రతినిధులకు ఈ అవార్డును అందజేశారు.

**మంత్రి దామోదర రాజనర్సింహ హర్షం..**

అవయవదానంలో తెలంగాణ టాపర్‌గా నిలవడం పట్ల రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ హర్షం వ్యక్తం చేశారు. అవయవాలు పాడైపోయిన వ్యక్తుల ప్రాణాలు కాపాడే లక్ష్యంతో ఉమ్మడి రాష్ట్రంలో 2012లో జీవన్‌దాన్ ప్రారంభించామని ఈ సందర్భంగా మంత్రి గుర్తు చేశారు. పేద, ధనిక బేధం లేకుండా అవసరమైన వారందరికీ అవయవాలు అందేలా ఇటీవలే తోట యాక్ట్‌ను అడాప్ట్ చేసుకున్నామని మంత్రి తెలిపారు. బ్రెయిన్ డెత్ కేసులలో అవయవాలు వృథా పోకుండా, దానం చేయాలని ఈ సందర్భంగా ప్రజలకు మంత్రి విజ్ఞప్తి చేశారు. ఆరోగ్యశ్రీ కింద ఉచితంగా అవయవ మార్పిడి చికిత్సను అందిస్తున్నామన్నారు. 2024లో 188 మంది బ్రెయిన్ డెత్ దోనర్ల నుంచి, 725 అవయవాలను ఇతరులకు అమర్చి, వారి ప్రాణాలు కాపాడగలిగామని మంత్రి వెల్లడించారు.

## హైదరాబాద్ నుంచి విజయవాడ గ్రీన్ ఫీల్డ్ రోడ్డు

రెండు గంటల్లో చేరుకునేలా రోడ్డు నిర్మాణం చేయబోతున్నాం: మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి



**హైదరాబాద్, మహా:** హైదరాబాద్ నుంచి విజయవాడ రెండు గంటల్లో చేరుకునేలా గ్రీన్ ఫీల్డ్ రోడ్డు నిర్మాణం చేయబోతున్నాం..అని తెలంగాణ మంత్రి కోమటిరెడ్డి పేర్కొన్నారు. ఎల్బీనగర్ నుండి పెద్ద అంబర్ పేట వరకు నిర్మించే ఎలివేటెడ్ కారిడార్ కు సంబంధించి వనస్థలిపురం జంక్షన్ లో క్షేత్ర స్థాయి పనులను స్థానిక ఎమ్మెల్యేతో కలిసి మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పరిశీలించారు. అనంతరం మీడియాతో మంత్రి మాట్లాడుతూ.. ఈ ప్రాంత ప్రజల ట్రాఫిక్ కష్టాలు నాకు తెలుసు. ఎంపీగా ఉన్నప్పుడే ఈ ప్రాంతంలో రోడ్ల అభివృద్ధి కోసం కృషి చేశాను. ఇప్పుడు రోడ్లు భవనాలు శాఖ మంత్రిగా ఉన్నాను ..ఈ పెండింగ్ పనులు వెంటనే పూర్తి చేసేందుకు కృషి చేస్తాను.

**బంగారు తెలంగాణ అని.. అప్పుల తెలంగాణ**

సుమారు 650 కోట్ల వ్యయంతో ఈ ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణం చేయబోతున్నాం. హైదరాబాద్ నుండి విజయవాడ రెండు గంటల్లో చేరుకునేలా గ్రీన్ ఫీల్డ్ రోడ్డు నిర్మాణం చేయబోతున్నాం. కేంద్ర మంత్రి గడ్కరీని ఈనెల 6న కలుస్తాం..అని మంత్రి తెలిపారు. హైదరాబాద్ అభివృద్ధి చేశామంటున్న కేటీఆర్.. ఉప్పల్ నారపల్లి ఫ్లై ఓవర్ ఎందుకు పూర్తి చేయలేదు. పదేళ్లు బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలను ఏమార్చింది.. అభివృద్ధి చేయలేదు. బంగారు తెలంగాణ అని.. అప్పుల తెలంగాణ చేసింది. ప్రజలే దేవుళ్ళుగా మారి రాష్ట్రాన్ని కాపాడుకోవడానికి కాంగ్రెస్ పార్టీని గెలిపించుకున్నారు. బీసీ రిజర్వేషన్లు కేసీఆర్ బిడ్డకు ఏం పని..10 ఏళ్లు ఎందుకు మాట్లాడలేదు బీసీల గురించి. ఎవరెంతో వారికంతా ఇవ్వాలనేది మా ఇందిరమ్మ ప్రభుత్వ విధానం. రేషన్ కార్డులు,సన్నబియ్యం,ఇందిరమ్మ ఇండ్లు ఇస్తున్నాం...అని మంత్రి కోమటిరెడ్డి పేర్కొన్నారు.

## బనకచర్లపై ఎంతవరకైనా పోరాడుతాం

### ప్రాజెక్టును ఎట్టి పరిస్థితుల్లోనూ కట్టనివ్వం

ఈ విషయంలో ప్రభుత్వం రాజీ పడే ప్రసక్తే లేదు

ముఖ్యమంత్రి భేటీలో మా వాదనలు గట్టిగా వినిపించాం:మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

పెద్దపలిలో రేషన్ కార్డుల పంపిణీ, ఐటీఐ కళాశాల భవన నిర్మాణానికి శంకుస్థాపన

పాల్గొన్న మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, అడ్లూరి లక్ష్మణ్, పొన్నం ప్రభాకర్

**పెద్దపల్లి,మహా:** ఏపీ ప్రభుత్వం అక్రమంగా నిర్మించే తలపెట్టిన బనకచర్ల ప్రాజెక్టును కచ్చితంగా అడ్డుకొని తీరుతుందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ఆదివారం మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, మంత్రి పొన్న ప్రభాకర్ పెద్దపల్లి జిల్లా ధర్మారం మండల కేంద్రంలో పర్యటించారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు కొత్త రేషన్ కార్డులను పంపిణీ చేయడంతో పాటు రూ.45.1 కోట్ల వ్యయంతో నిర్మించ తలపెట్టిన ఐటీఐ భవన నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమానికి మంత్రి లక్ష్మణ్ కుమార్ అధ్యక్షత వహించగా ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. గోదావరి నదికి అనుసంధానంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అక్రమంగా నిర్మించ తలపెట్టిన బనకచర్ల ప్రాజెక్టును రాష్ట్ర ప్రభుత్వం తీవ్రంగా వ్యతిరేకిస్తుందని ఆయన వెల్లడించారు. తాను సిడబ్ల్యూసీకి లేఖ రాయడంతో కేంద్ర ప్రభుత్వం అట్టి ప్రాజెక్టు నిర్మాణానికి అభ్యంతరం తెలిపిందని ఆయన తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లోనూ బనకచర్ల ప్రాజెక్టును అడ్డుకొని తీరుతామని ఎంతటి పోరాటానికైనా తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు.

**రాజీ పడే ప్రసక్తే లేదు..**

బనకచర్ల ప్రాజెక్టు నిర్మాణంపై ప్రభుత్వం రాజీ పడే ప్రసక్తే లేదని ఆయన ప్రకటించారు. మంత్రి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ.. నిరుపేద విద్యార్థుల ఉపాధి అవకాశాల కోసం ధర్మారం మండలానికి ఐటీఐ కళాశాల మంజూరు చేయించడంతోపాటు భవన నిర్మాణానికి ప్రభుత్వం నుంచి రూ.45.15 కోట్ల నిధులను మంజూరు చేయించడం ఆనందంగా ఉందని అన్నారు. అదేవిధంగా పత్తిపాక రిజర్వాయర్ నిర్మాణం కోసం డీపీఆర్ తయారు చేయడానికి ప్రభుత్వం చేయడం హర్షణీయమని అన్నారు. తన పదవి



కాలంలో మండలంలో అనేక అభివృద్ధి పనులు చేస్తానని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

**ప్రజా సంక్షేమం కోసం కట్టుబడి ఉన్నాం..**

అనంతరం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. నీటి అవసరం ఎక్కువగా ఉన్న వరి,పత్తి, మిర్చి సాగును రైతులు తగ్గించడమే శ్రేయస్కరమని అన్నారు. నీటి అవసరం తక్కువగా ఉన్న ఆయిల్ పామ్ తోటలు సాగు చేసి ఆర్థికంగా రైతులు ఎదగాలని అన్నారు. తాను కూడా ఆయిల్ పామ్ తోటలు సాగు చేస్తున్నాననని ఉదాహరణ అని ఆయన చెప్పుకొచ్చారు. సిద్దిపేట జిల్లాలో ఆయిల్ పామ్ ఫ్యాక్టరీని నెలకొల్పుతామని తదనంతరం జిల్లాకు ఒక ఫ్యాక్టరీ ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. ప్రజా సంక్షేమం కోసం తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. మహాలక్ష్మి పథకంలో భాగంగానే ఆర్టీసీ బస్సుల్లో మహిళలు ఉచితంగా ప్రయాణం చేయడానికి అవకాశం కల్పించామని అన్నారు. తమ ప్రభుత్వం గురుకులాలు, వసతి గృహాలు నివాసం ఉండే విద్యార్థుల మెస్ చార్జీలను పెంచిందని, గృహ జ్యోతి ద్వారా ప్రతి ఇంటికి 200 యూనిట్ల ఉచితంగా విద్యుత్తును అందిస్తున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు.

# బనకచర్ల పాపం బీఆర్ఎస్ దే

- ఏపీ ప్రభుత్వ కుట్రలు, కుతంత్రాలను అడ్డుకుని తీరుతాం
- రాజకీయాల కంటే రాష్ట్ర ప్రయోజనాలే మాకు ముఖ్యం
- పదేళ్లలో వారు చేసిందేం లేదు... తప్పులను సరిదిద్దుతున్నాం
- రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క



**ఖమ్మం, మహా:** తెలంగాణకు న్యాయంగా దక్కాల్సిన సాగునీటి వాటాలో ఒక్క చుక్క నీటిని కూడా వదులుకోబోమని, తమకు రాజకీయాల కంటే రాష్ట్ర ప్రయోజనాలే ముఖ్యమని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. బనకచర్ల పాపం బీఆర్ఎస్ దేనని, ఏపీ ప్రభుత్వం పన్నుతున్న కుట్రలు, కుతంత్రాలను అడ్డుకుని తీరుతామన్నారు. ఖమ్మం జిల్లా ముదిగొండ మండలం కమలాపురం గ్రామంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఆధ్వర్యంలో రూ.10 కోట్లతో నిర్మించ తలపెట్టిన 10వేల మెట్రిక్ టన్నుల గోదాముల నిర్మాణ పనులకు ఆయన ఆదివారం భూమి పూజ చేశారు. 'గతంలో 5.91 లక్షల మెట్రిక్ టన్నుల సామర్థ్యమున్న గోదాంలు రైతులకు అందుబాటులో ఉండేవి. మేం అధికారంలోకొచ్చిన ఏడాదిన్నర వ్యవధిలోనే కొత్తగా 10.75 లక్షల మెట్రిక్ టన్నుల సామర్థ్యమున్న గోదాంలను నిర్మించాం. అన్నదాతల సంక్షేమం, వ్యవసాయాభివృద్ధికి మా ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోంది. అందుకే... దేశంలోనే వరిని అత్యధికంగా పండించే రాష్ట్రంగా తెలంగాణ నిలిచింది' అని ఈ సందర్భంగా ఆయన వివరించారు. 'ఉమ్మడి ఏపీలో సాగునీటి రంగంలో తెలంగాణకు తీవ్ర అన్యాయం జరిగింది. అందుకే.. సబ్బండ వర్గాలు కొట్లాడి ప్రత్యేక రాష్ట్రాన్ని తెచ్చుకున్నాం. ఇప్పుడు కూడా మన రాష్ట్రంపై అవే కుట్రలు జరుగుతున్నాయి. ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండి... వాటిని సమర్థవంతంగా తిప్పి కొట్టాలి. మన పొరుగు రాష్ట్రం ఏపీ... మన పంట పొలాలు ఎండిపోయేలా అక్రమ ప్రాజెక్టుల నిర్మాణానికి శ్రీకారం చుడుతోంది. సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఢిల్లీకి వెళ్లి సమర్థవంతంగా వాదనలు వినిపించడం వల్లే బనకచర్ల ప్రాజెక్టుకు బ్రేక్ పడింది' అని చెప్పారు. 'సాగునీటి రంగ అభివృద్ధికి పదేళ్లలో బీఆర్ఎస్ చేసింది శూన్యం. కృష్ణా, గోదావరిపై గతంలో కాంగ్రెస్ ప్రభుత్వాలు నిర్మించిన ప్రాజెక్టులే మన పంట పొలాలకు నీళ్లందిస్తున్నాయి. వాళ్ల హయాంలో ఒక్కటంటే ఒక్కటి పనికొచ్చే ప్రాజెక్టును కట్టలేదు. రూ.లక్ష కోట్లు వెచ్చించి నిర్మించిన కాళేశ్వరం వల్ల ఒక్క ఎకరాకు కూడా నీళ్లందడం లేదు. ఇప్పటికైనా బీఆర్ఎస్ నాయకులు మాపై విమర్శలు చేయడం మాని, అసలు విషయాలను తెలుసుకోవాలి' అని సూచించారు. 'అప్పుడు పోలవరం కడుతుంటే చోద్యం చూశారు. బనకచర్ల నిర్మాణానికి శ్రీకారం చుడుతుంటే పట్టించుకోలేదు. నీళ్లు సముద్రం పాలవుతున్నా పట్టనట్లుగా వ్యవహరించారు. పైగా... అప్పటి ఏపీ పాలకులకు రెడ్ కార్పెట్ తో స్వాగతం పలికి రాష్ట్ర ప్రయోజనాలు తాకట్టు పెట్టారు.

విభజన చట్టంలో లేకపోయినా ఆర్డినెన్స్ ద్వారా 7 మండలాలను ఏపీలో కలుపుతుంటే స్పందించలేదు' అని విమర్శించారు. 'తెలంగాణకు పట్టిన శాపం బీఆర్ఎస్. గత పదేళ్లలో జరిగిన తప్పులను ఒక్కొక్కటిగా సరిదిద్దుతున్నాం. కృష్ణా, గోదావరి నీటిని సద్వినియోగం చేసుకుని రాష్ట్రంలోని ప్రతి ఎకరాకు నీళ్లందించేలా పకడ్బందీ కార్యాచరణతో ముందుకెళ్తున్నాం. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని చక్క దిద్దుతూనే... సంక్షేమ పథకాలు, అభివృద్ధి ప్రాజెక్టులను సమర్థవంతంగా అమలు చేస్తున్నాం' అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కార్పోరేషన్ల ఛైర్మన్లు రాయల నాగేశ్వరరావు, నాయుడు సత్యానారాయణ, కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తదితరులు పాల్గొన్నారు.

# నేటి నుంచి షూటింగ్స్ బంద్

## తెలుగు ఫిలిం ఫెడరేషన్ సంచలన నిర్ణయం

### 30 శాతం జీతాలు పెంచితేనే షూటింగ్‌లో పాల్గొంటామని అల్టిమేటం



**హైదరాబాద్, మహా:** తెలుగు ఫిలిం ఫెడరేషన్ సంచలన నిర్ణయం తీసుకుంది. నేటి నుంచి టాలీవుడ్‌లో షూటింగ్స్ నిలిపి వేయాలని నిర్ణయించింది. 30 శాతం మేర జీతాలు పెంచాలని డిమాండ్ చేస్తూ ఈ కీలక నిర్ణయం తీసుకున్నారు. గత కొంత కాలంగా టాలీవుడ్ కార్మిక సంఘాల ఫెడరేషన్‌కు తెలుగు ఫిలిం చాంబర్‌కు మధ్య జీతాల విషయంలో చర్చలు నడుస్తున్నాయి. ప్రతి మూడేళ్లకు ఒకసారి తమ జీతాలు పెంచాలని కార్మిక సంఘాల ఫెడరేషన్ డిమాండ్ చేస్తుంది. అయితే మూడేళ్ల దాటినా జీతాలు పెంచకపోవడం పట్ల కార్మికులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఆ క్రమంలో ఇటీవల తెలుగు ఫిలిం చాంబర్‌తో ఆయా సంఘాల ఫెడరేషన్ ప్రతినిధులు పలు దఫాలుగా చర్చలు సైతం జరిపారు. తాము 30 శాతం పెంచలేమని.. కేవలం 7 నుంచి 8 శాతం వరకు మాత్రమే పెంచగలమని వారికి ఫిలిం చాంబర్ ప్రతినిధులు క్లియర్ కట్‌గా స్పష్టం చేశారు. ఫిలిం చాంబర్ ప్రతినిధులు చేసిన ప్రతిపాదనలను కార్మిక సంఘాల ఫెడరేషన్ ఒప్పుకోలేదు. ఈ నేపథ్యంలో షూటింగ్స్ నిలిపి వేయాలని నిర్ణయం తీసుకుంది.

# లోకేష్.. బనకచర్ల విషయంలో రెచ్చగొట్టొద్దు

- ముందు నికర జలాలు, మిగులు జలాలు తెలుసుకోండి
- ఏమీ తెలియకుండా ఏపీ ప్రజలను మభ్య పెడుతున్నారు
- ఏపీ మంత్రి నారా లోకేష్‌పై పొన్నం ప్రభాకర్ ఫైర్



**హైదరాబాద్, మహా:** బనకచర్ల విషయంలో ఏపీ మంత్రి నారా లోకేశ్ చేసిన వ్యాఖ్యలపై మంత్రి పొన్నం ప్రభాకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బనకచర్ల విషయంలో తామేదో.. రెచ్చగొడుతున్న లోకేశ్ మాట్లాడటం సరికాదన్నారు. ఆయన ముందుగా.. వరద జలాలు, నికర జలాలు, మిగులు జలాల గురించి తెలుసుకుంటే మంచిది అంటూ హితవు పలికారు. మంత్రి పొన్నం ప్రభాకర్ ట్విట్టర్ వేదికగా వీడియోలో మాట్లాడుతూ..'ఏపీ మంత్రి నారా లోకేశ్ బనకచర్ల కోసం వరద నీరు తీసుకుపోతే ప్రాంతీయతత్వం రెచ్చగొడుతున్నారని అంటున్నారు. నికర జలాలు, మిగులు జలాల సంగతి తేలాక వరద జలాల గురించి ఆలోచించాలి. ఆయన ముందుగా.. వరద జలాలు, నికర జలాలు, మిగులు జలాల గురించి తెలుసుకుంటే మంచిది. తెలంగాణ ప్రాజెక్టుల పైనున్న ప్రాజెక్టుల్లో నీటి వినియోగం పూర్తైన తర్వాత వరద జలాల గురించి ఆలోచన చేయాలి. అవేమీ తెలియకుండా లోకేశ్.. ఏపీ ప్రజలను మభ్యపెట్టి, తప్పుదోవ పట్టిస్తున్నారు.

**కచ్చితంగా మాట్లాడతాం..**

కేంద్ర ప్రభుత్వం, ట్రిబ్యునల్స్ చెప్పినదాని ప్రకారం ఒక్క చుక్క నీటిని కూడా తెలంగాణ వదులుకోదు. సీనియర్ నాయకుడిగా చంద్రబాబు ఇలాంటి నీటి వాటాలపై ఘర్షణ పూరిత వాతావరణానికి ఇరు రాష్ట్రాల మధ్య తెర లేపొద్దు. వరద జలాలు సముద్రంలో కలవాలని ఎవరూ కోరుకోరు.. మీరు వాటిని వాడుకుంటే అభ్యంతరం చెప్పాల్సిన అవసరమూ ఉండదు. కానీ, మా కోటా, మా వాటా పూర్తి కాకుండా నీటిని తరలిస్తామంటే మా హక్కులపై కచ్చితంగా నిలదీస్తాం, అడ్డుకుంటాం. మా రైతుల హక్కుల కోసం కచ్చితంగా మాట్లాడతాం. దానికి మేమేదో ప్రాంతీయ అసమానతలను రెచ్చగొడుతున్నట్టు లోకేశ్ వక్రీకరించడం సరికాదు. ఆనాడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో నీటి లభ్యత దృష్ట్యా 968 టీఎంసీలు తెలంగాణకు, 531 టీఎంసీలు ఏపీకి ఇచ్చిన తరువాత ఆ నికర జలాల మీద మిగులు జలాలు తీసుకున్న తర్వాత వరద జలాల గురించి ఆలోచించాలి. మా రాష్ట్ర హక్కులు మేము కాపాడుకుంటాం.. మీ రాష్ట్ర ప్రయోజనాలు కాపాడుకోండి. అంతే కానీ ప్రజలను మోసం చేసే విధంగా తప్పుడు సమాచారం ఇవ్వకండి అంటూ హితవు పలికారు.

# రాజకీయం కోసమే కవిత దీక్ష డ్రామా

- పదేళ్లు లేనిది ఇవ్వాలే బీసీలు గుర్తుకొచ్చారా?
- అసలు కులగణనలో కల్వకుంట్ల ఫ్యామిలీ పాల్గొన్నారా?
- రిజర్వేషన్లు పెంచలేక.. బీజేపీ మత రాజకీయాలు చేస్తోంది
- బీఆర్ఎస్, బీజేపీ లీడర్లపై మంత్రి సీతక్క ఫైర్



**హైదరాబాద్, మహా:** బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితపై మంత్రి సీతక్క విమర్శలు గుప్పించారు. రాష్ట్రంలో బీసీ రిజర్వేషన్ల వ్యవహారం రాజకీయ పార్టీల మధ్య హీట్ పెంచుతోంది. అధికార ప్రతిపక్ష లీడర్లు విమర్శలు, ప్రతి విమర్శలతో విరుచుకుపడుతున్నారు. తాజాగా ఓ మీడియాతో మంత్రి సీతక్క మాట్లాడుతూ.. ఓట్ల కోసం బీజేపీ మత రాజకీయాలు చేస్తుందని మండిపడ్డారు. బీసీ రిజర్వేషన్లు ఇవ్వడం ఆ పార్టీకి ఇష్టం లేక, కాంగ్రెస్‌పై విమర్శలు చేస్తుందని చెప్పారు. బీజేపీ నిజ స్వరూపాన్ని ప్రజలు గుర్తించాలని, అధికారం కోసమే కవిత దీక్ష డ్రామా మొదలుపెట్టిందని విమర్శించారు. బీఆర్ఎస్ 10 ఏళ్లు అధికారంలో ఉండగా.. బీసీ రిజర్వేషన్లు ఎందుకు తగ్గించారో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ కుటుంబ సభ్యులు కుల గణనలో పాల్గొనలేదని, వాళ్లకు బీసీ రిజర్వేషన్ల పై మాట్లాడే అర్హత లేదని చెప్పారు. గత ప్రభుత్వం 33 శాతం బీసీ రిజర్వేషన్లు 23 శాతానికి తగ్గించిందన్నారు. రేవంత్ రెడ్డి ఢిల్లీ వెళ్తే తప్పేముంది? బీఆర్ఎస్ అధికారంలో ఉండగా జార్ఖండ్, ఢిల్లీ, మహారాష్ట్రకు ఏ సంబంధం ఉందని వెళ్లారు? అని ప్రశ్నించారు. సీఎం ఢిల్లీ వెళ్లి ప్రజల పక్షాన పోరాటం చేస్తున్నారు. కేసీఆర్ లా ఫాం హౌస్‌లో పడుకోలేదని ఎద్దేవా చేశారు. బీసీ రిజర్వేషన్ల అమలు కోసం కేంద్రంపై ఒత్తిడి తెచ్చేందుకు ఢిల్లీలో ఆందోళనలు చేస్తామని, ఢిల్లీలో ఆందోళన అనంతరం కేంద్రం స్పందనను బట్టి స్థానిక సంస్థల ఎన్నికలపై నిర్ణయం ఉంటుందని మంత్రి సీతక్క తెలిపారు.

# ఫామ్‌హౌస్‌లో మంత్రాంగం

## కీలకనేతలతో కేసీఆర్ భేటీ

### కాళేశ్వరం నివేదిక, కవిత ఎపిసోడ్ పై చర్చ

**హైదరాబాద్, మహా:** బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ ఆదివారం మరోసారి ఎర్రవెల్లి ఫామ్ హౌస్‌లో బీఆర్ఎస్ ముఖ్య నేతలతో సమావేశం అయ్యారు. ఉమ్మడి మెదక్, కరీంనగర్, ఆదిలాబాద్, నల్గొండ, నిజామాబాద్ జిల్లా నాయకులతో మంతనాలు జరుపుతున్నారు. మీటింగ్‌లో హరీశ్‌రావు, సంజయ్, ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, జగదీశ్ రెడ్డి, వేముల ప్రశాంత్‌రెడ్డి పాల్గొన్నట్లు తెలుస్తోంది. జగదీష్ రెడ్డి తో పాటు నిజామామాద్, జగిత్యాల నేతలతో కవిత వ్యవహారంపై చర్చించినట్లు తెలుస్తోంది. కాళేశ్వరం నివేదిక, ప్రభుత్వ చర్యల నేపథ్యంలో అనుసరించాల్సిన వైఖరికి కీలక నేతలు హరీష్‌రావు, జగదీష్‌రెడ్డిలతో చర్చించినట్లు తెలిసింది. సుదీర్ఘకాలం విచారించిన జస్టిస్ ఘోష్ కమిషన్ తీవ్రమైన సిఫార్సులు చేశారన్న ప్రచారాల నేపథ్యంలో ప్రభుత్వ అడుగులను వ్యూహాత్మకంగా పరిశీలిస్తున్నారు.

## హైదరాబాద్ కలెక్టర్ హరిచందనపై సీఎస్‌కు ఫిర్యాదు చేసిన బీఆర్ఎస్

**హైదరాబాద్, మహా:** హైదరాబాద్ కలెక్టర్ హరిచందన, సివిల్ సప్లైస్ కమిషనర్ డీఎస్ చౌహాన్ రేషన్ కార్డుల విషయంలో తప్పుడు ప్రకటనలు చేసి ప్రజలను తప్పుదారి పట్టించారని బీఆర్ఎస్ పార్టీ ఆరోపించింది. వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణకు ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్, ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, బీఆర్ఎస్ నాయకుడు ఆనంద్ గౌడ్ ఫిర్యాదు చేశారు. ఇటీవల హైదరాబాద్ బంజారాహిల్స్‌లో నిర్వహించిన రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో హరిచందన, డీఎస్ చౌహాన్ పాల్గొన్నారని, ఈ సందర్భంగా గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై తప్పుడు ఆరోపణలు చేశారని వారు ఆ లేఖలో పేర్కొన్నారు. 'గత పదేళ్లలో కొత్త రేషన్ కార్డుల ఇచ్చిన దాఖలాలు లేవు. చాలామంది దరఖాస్తు చేసుకున్నప్పటికీ ఒక్కటి కూడా ఇవ్వలేదు' అని డీఎస్ చౌహాన్ అన్నారని తెలిపారు. అలాగే 'గత 12 ఏళ్ల కింద నేను సబ్ కలెక్టర్‌గా ఉన్నప్పుడు రేషన్ కార్డులు ఇచ్చాం. మళ్లీ ఇప్పుడే ఇస్తున్నాం' అని హరిచందన వ్యాఖ్యానించారని పేర్కొన్నారు. ఇవన్నీ తప్పుడు ఆరోపణలేనని.. బీఆర్ఎస్ ప్రభుత్వం నిబంధనల ప్రకారం 6.47 లక్షల రేషన్ కార్డులను ఇచ్చిందని ఆ లేఖలో వివరించారు. అధికారులు ప్రజాప్రతినిధుల మెప్పు కోసం తప్పుడు ప్రచారం చేస్తున్నారని.. ఇది ప్రజాస్వామ్యానికి హానికరమని అన్నారు. తప్పుడు ప్రచారం చేస్తున్న సదరు అధికారులపై వెంటనే క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ నాయకులు విజ్ఞప్తి చేశారు. అధికారుల పనితీరును డీపీవోటీకి నివేదించాలని కోరారు. సదరు అధికారులు బహిరంగ క్షమాపణతో పాటు వాస్తవాలు బయటపెట్టాలని డిమాండ్ చేశారు.

# భారత అమేయ శక్తికి ఆపరేషన్ సిందూర్ నిదర్శనం

## సరిహద్దులు దాటకుండా ఉగ్రవాదులను నిర్మూలించాం

- సరికొత్త ప్రమాణాన్ని నెలకొల్పాం
- మన ఆర్థిక శక్తి ఏమిటో త్వరలోనే అగ్రరాజ్యాలకు తెలుస్తుంది
- మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు



**హైదరాబాద్, మహా :** ఆపరేషన్ సిందూర్ ద్వారా భారత్ శక్తి సామర్థ్యాలు ప్రపంచానికి తెలిశాయని మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు అన్నారు. సీమాంతర ఉగ్రవాదాన్ని ఎగదోస్తూ భారత ప్రజలకు హాని తలపెడుతుంటే ఇక ఏమాత్రం చూస్తూ ఊరుకోబోమని ఆపరేషన్ సిందూర్ ద్వారా గట్టిగా తెలియజేశామని చెప్పారు. ఆపరేషన్ సిందూర్ లో పాలుపంచుకున్న సైనిక వీరులకు, తెర వెనక కృషి చేసిన శాస్త్రవేత్తలకు వందనం తెలియజేయడానికి ఆదివారం హైదరాబాద్ గచ్చిబౌలి లోని ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజిలో అఖిల భారతీయ శైక్షిక్ మహాసంఘ్ (ఏబీఆర్ఎస్ఎం) నిర్వహించిన కార్యక్రమంలో వెంకయ్యనాయుడు ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. జాతీయతా భావం మెండుగా ఉన్న ఉపాధ్యాయులు, మేధావులు, ప్రముఖ శాస్త్రవేత్తలు, ఇతర ప్రఖ్యాత నిపుణులతో ఈ వేదిక పైనుంచి తన ఆలోచనలు పంచుకోవడం సంతోషంగా ఉందని చెప్పారు. పహల్గాంలో 2025 ఏప్రిల్ 22న పాక్ మద్దతుతో ఉగ్రవాదులు చేసిన పాశవిక దాడిలో 26 మంది అమాయకులు ప్రాణాలు కోల్పోయారని, మతం పేరు అడిగి మరీ మన ఆడబిడ్డల జీవిత భాగస్వాములను అతి దారుణంగా చంపేశారని గుర్తు చేశారు. మన ఆడబిడ్డల నుదుటి సిందూరానికి గుర్తుగా ఆపరేషన్ సిందూర్ ను చేపట్టి భారత్ తన శక్తిని చాటి చెప్పిందన్నారు.

"పాక్ లోని పౌరులకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా, సరిహద్దులు దాటకుండా పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్ లోని 9 ఉగ్ర శిబిరాలపై కచ్చితమైన దాడులను నిర్వహించి వాటిని భారత సైనికులు నాశనం చేసిన తీరు చూసి ప్రపంచం ఆశ్చర్యపోయింది. ఈ ఆపరేషన్ లో 100 మంది ఉగ్రవాదులు, ఉగ్రవాద నాయకులు మరణించారు. భారత శక్తి సామర్థ్యాలేమిటో ప్రపంచానికి ఈ ఆపరేషన్ తెలియజేసింది" అని చెప్పారు. కేవలం 23 నిమిషాల్లోనే మన సైన్యం ఈ ఆపరేషన్ పూర్తి చేసిందన్నారు. ఇంతటి గొప్ప విజయం ప్రపంచంలో మరెక్కడా లేదన్నారు. స్వదేశీ క్షిపణులు, డ్రోన్లు, శక్తిమంతమైన ఎలక్ట్రానిక్ వార్ఫేర్ టెక్నాలజీ, శత్రుదుర్భేద్యమైన రక్షణ వ్యవస్థ వినియోగంతో భారత్ తన స్థాయిని చాటిందన్నారు. ఈ ఆపరేషన్ త్రివిధ దళాలు, ఆర్మీ, నేవీ, ఎయిర్ ఫోర్స్ మధ్య అత్యద్భుతమైన సమన్వయాన్ని చాటి చెప్పిందన్నారు. బహుళ అంచెల గగనతల రక్షణ వ్యవస్థలు శత్రువు దాడులను సమర్థంగా తిప్పికొట్టాయన్నారు. యుద్ధక్షేత్రంలో హీరోలు మన సైన్యమైతే మంచి యుద్ధ వ్యవస్థలను అభివృద్ధి చేసి సైన్యానికి అందించడంలో మన శాస్త్రవేత్తలు కీలక పాత్ర పోషించారని వెంకయ్య నాయుడు అభినందించారు.

"ఆపరేషన్ సిందూర్ అంతటితో ఆగలేదు. కొద్ది రోజుల క్రితం మన సైనికులు, పారా మిలిటరీ బలగాలు ఆపరేషన్ మహాదేవ్ ద్వారా పహల్గాం దాడికి పాల్పడిన ఉగ్రవాదులను తుదముట్టించారు." అని గుర్తు చేశారు. "2025 మే 6, 7 తేదీల్లో ప్రారంభమైన ఆపరేషన్ సిందూర్ ద్వారా ఇకపై ఉగ్రదాడి యుద్ధానికి సమానం అని భారత్ తెలియజెప్పింది. పాకిస్థాన్ అణ్వాయుధాల బెదిరింపులకు లొంగబోం అని మనం సమాధానం చెప్పాం " అని వెంకయ్యనాయుడు చెప్పారు. "భారత దేశ సుదీర్ఘ సాంస్కృతిక చరిత్రను గమనిస్తే మనమెప్పుడూ మరొకరి దేశాన్ని, భూభాగాన్ని ఆక్రమించలేదు. అయితే దీన్ని బలహీనతగా చూడరాదు. మనల్ని అస్థిరపర్చాలని చూస్తే మౌనంగా చూస్తూ ఊరుకోం. మన శక్తి సామర్థ్యాలను చాటి చెబుతాం. ఈ విషయం ఆపరేషన్ సిందూర్ ద్వారా నిరూపించాం." అని చెప్పారు. భారత్ సరికొత్త ప్రమాణాన్ని నెలకొల్పిందని, ఇకపై ఉగ్రవాద చర్యలకు పాల్పడితే వారు ఎక్కడా దాక్కొన్నా శిక్ష అనుభవించాల్సిందే అన్న విషయం వారికి బోధపడిందని చెప్పారు. భారత దేశ స్వయం సమృద్ధిని ఈ ఆపరేషన్ నిరూపించిందని చెప్పారు. 2014లో ప్రారంభించిన ఆత్మనిర్భర్ భారత్ కార్యక్రమం ద్వారా రక్షణ రంగంలో స్వదేశీ డ్రోన్లు, క్షిపణులను అభివృద్ధి చేసుకున్నామని, విదేశాలపై ఆధారపడడం తగ్గించుకున్నామని చెప్పారు. గత దశాబ్దంలో రక్షణ బడ్జెట్ మూడింతలు పెరిగిందని గుర్తుచేశారు. మన సాయుధ దళాలు లక్ష్య సిద్ధిలో చూపిన ధైర్యం, సంకల్ప బలానికి దేశం యావత్తూ ప్రణామాలు తెలియజేస్తోందన్నారు. కొన్ని అభివృద్ధి చెందిన దేశాలు పాకిస్థాన్ ను పరోక్షంగా ప్రోత్సహిస్తున్నాయని, సూపర్ పవర్ గా చెప్పుకునే కొన్ని దేశాలు భారత్ ను ఆర్థికంగా చతికిల పడిన దేశంగా అభివర్ణిస్తున్నాయని అటువంటి వారికి త్వరలోనే భారత్ గొప్పదనం తెలుస్తుందని వెంకయ్యనాయుడు చురకలు వేశారు. మనం త్వరలోనే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించబోతున్నట్లు చెప్పారు. మనది స్వతంత్ర దేశమని, ఎవరితో వ్యాపారం చేయాలో మనకు తెలుసని, మన ప్రయోజనాలకు అనుగుణంగానే మనం వ్యాపారం చేస్తామని స్పష్టం చేశారు.

ఆపరేషన్ సిందూర్ లో తాము అభివృద్ధి చేసిన క్షిపణి, డ్రోన్, ఇతర రక్షణ వ్యవస్థలు అద్భుత పనితీరు కనబర్చినందుకు చాలా సంతోషంగా ఉందని కార్యక్రమంలో పాల్గొన్న శాస్త్రవేత్తలు చెబుతూ భావోద్వేగానికి గురయ్యారు. భారత రక్షణ రంగ శాస్త్రవేత్తలు, భారత రక్షణ రంగ పరిశ్రమలు, మన సైన్యం సంయుక్త విజయంగా ఆపరేషన్ సిందూర్ ను వక్తలు అభివర్ణించారు. స్వదేశీ పరిజ్ఞానం మరింత సముపార్జించుకోబోతున్నామని చెప్పారు. ఇతర దేశాలపై ఆధారపడే పరిస్థితి ఉండబోదన్నారు. ఆపరేషన్ సిందూర్ లో మన స్వదేశీ యుద్ధ వ్యవస్థలు 90శాతం కచ్చితత్వంతో విజయం సాధించడం పట్ల అగ్రరాజ్యాలు ఆశ్చర్యపోయాయని చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్ జి. సతీష్ రెడ్డి నేషనల్ సెక్యూరిటీ అడ్వైజరీ బోర్డు సభ్యుడు, యు. రాజబాబు, డైరెక్టర్ జనరల్ మిస్సైల్స్ అండ్ స్ట్రాటజిక్ సిస్టమ్స్, డాక్టర్ జగన్నాథ్ నాయిక్, డైరెక్టర్ సెంటర్ ఫర్ హై ఎనర్జీ సిస్టమ్స్, అకాశ్, డాక్టర్ జి. చంద్రమౌళి పూర్వ ప్రాజెక్ట్ డైరెక్టర్, అకాశ్, మేజర్ జనరల్ అజయ్ మిశ్రా జనరల్ ఆఫీసర్ కమాండింగ్ తెలంగాణ , ఆంధ్ర ఉపప్రాంతం, పేట్రిక్ డి సిల్వా, మాజీ ప్రోగ్రాం డైరెక్టర్, మీడియం రేంజ్ సర్ఫేస్ టు ఎయిర్ మిస్సైల్, అజిత్ బి చౌదరి, ప్రాజెక్ట్ డైరెక్టర్ - అకాశ్, ప్రోగ్రాం డైరెక్టర్ - హెచ్ సీఎం, సుబ్బారావు పావులూరి సీఎండీ, అనంత్ టెక్నాలజీస్ లను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఇంకా జి. లక్ష్మణ్ నేషనల్ జాయింట్ ఆర్గనైజేషన్ సెక్రటరీ, అఖిల భారతీయ శైక్షిక మహాసంఘ్ (ఏబీఆర్ఎస్ఎం), డాక్టర్ సి. హెచ్. ప్రీతీ రెడ్డి డైరెక్టర్, మల్లా రెడ్డి గ్రూప్ ఆఫ్ ఇన్స్టిట్యూషన్స్, డాక్టర్ రామేశ్వర్ రావు, ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా, కృష్ణారెడ్డి ఏబీఆర్ఎస్ఎం కన్వీనర్ తదితరులు పాల్గొని ప్రసంగించారు. లెఫ్టినెంట్ జనరల్ కరణ్ వీర్ సింగ్ బ్రార్, ఆపరేషన్ సిందూర్ నేపథ్యాన్ని వీడియో రూపంలో ప్రదర్శించి వివరించారు. అంతకు ముందు ఓ సైనికుడా.. ఓ వీరుడా అంటూ ఉత్తేజిత పూరితంగా రూపొందించిన శౌర్యగీతాన్ని వెంకయ్యనాయుడు ఆవిష్కరించారు.

# ఏది పడితే అది మాట్లాడితే కుదరదు

## బనకచర్ల ప్రాజెక్టును నిర్మించడానికి అంగీకరించం

### నారా లోకేష్ కు మంత్రి శ్రీధర్ బాబు కౌంటర్



**హైదరాబాద్, మహా:** గోదావరిబనకచర్ల లింక్ ప్రాజెక్టుపై ఏపీ మంత్రి నారా లోకేశ్ చేసిన వ్యాఖ్యలకు తెలంగాణ మంత్రి శ్రీధర్ బాబు గట్టి కౌంటర్ ఇచ్చారు. గోదావరి, కృష్ణా నదుల్లో నికర, మిగులు, వరద జలాల వాటా తేలకముందే బనకచర్ల ప్రాజెక్టును నిర్మించడానికి తాము అంగీకరించబోమని శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. ఆదివారం ఒక న్యూస్ ఛానల్‌తో మాట్లాడిన ఆయన, గోదావరి, కృష్ణా నదులపై తెలంగాణ నిర్మిస్తున్న ప్రాజెక్టులు, రాష్ట్ర వాటాలను త్వరలో తేల్చాలని కేంద్రాన్ని కోరామని తెలిపారు.తెలంగాణ కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మిస్తుంటే తాము అడ్డుకోలేదని, ఇప్పుడు వృథాగా పోతున్న నీటిని ఉపయోగించుకుంటామంటే చిచ్చు పెట్టే ప్రయత్నం చేస్తున్నారన్న ఏపీ వాదనను ఆయన ఖండించారు. గోదావరిలో తెలంగాణకు ఉన్న కేటాయింపుల మేరకు మేము ప్రతిపాదనలు చేసుకుంటున్నాం. మా వాటాలో మేము ప్రాజెక్టులు కట్టుకుంటే ఆపడానికి, అడ్డుకోవడానికి మీరెవరు?" అని ఆయన సూటిగా ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం నుంచి మద్దతు ఉందని ఏది చేసినా చెల్లుతుందనుకుంటే ఊరుకునే ప్రసక్తే లేదని హెచ్చరించారు. తమ రాష్ట్ర రైతాంగ ప్రయోజనాలే ముఖ్యమని, ఇదే విషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టంగా చెప్పారని గుర్తు చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టులో బ్యారేజీలు కుంగిపోవడం బీఆర్ఎస్ వైఫల్యమేనని శ్రీధర్ బాబు విమర్శించారు. ఇంజనీర్లకు బదులు టీఆర్ఎస్ నాయకులు ఇచ్చిన ప్రణాళికలతోనే ఈ పరిస్థితి తలెత్తిందని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వ సంస్థ ఎన్డీఎస్ఏ ఇచ్చిన సూచనల మేరకే బ్యారేజీల విషయంలో ముందుకు వెళ్తున్నామని ఆయన వెల్లడించారు. ఈ వివాదం రెండు తెలుగు రాష్ట్రాల మధ్య మరింత ఉద్రిక్తతకు దారితీసే అవకాశం ఉంది.

# రాబోయే ఇరవై ఏళ్లకు సరిపడా విద్యుత్

## ఉత్పత్తికి ప్రణాళికలు రూపొందించాలి.. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క



**కొల్లాపూర్, మహా:** హైడల్ పవర్‌తో పాటు పంప్డ్ స్టోరేజ్‌తో పెద్ద ఎత్తున విద్యుత్ ఉత్పత్తి చేసి వినియోగంలోకి తీసుకు రావాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క విద్యుత్ అధికారులను ఆదేశించారు. ఆదివారం జెన్ కో, ట్రాన్స్ కో అధికారులతో కొల్లాపూర్ నియోజకవర్గంలోని సోమశిల వద్ద సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఇరవై మూడు పాయింట్స్ ను గుర్తించి వాటి మీద సమగ్రమైన రిపోర్ట్ ఇవ్వాలని సూచించారు. జూరాల నుంచి పులిచింతల వరకు కృష్ణా మీద ఉన్న హైడల్ పవర్ ప్రాజెక్టులను సమీక్షించి అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. అవసరం అయితే ప్రపంచ పేరుగాంచిన కన్సల్టెంట్ల సేవలను ఉపయోగించుకోవాలని ఆదేశించారు. సోలార్ ద్వారా పగలు జరిగే ఉత్పత్తిని స్టోరేజ్ చేసి రాత్రివేళ ఉపయోగానికి అవసరమైన సాంకేతికతను, దానికి అవసరమైన స్టోరేజ్ వ్యవస్థను రూపొందించి కోవాలన్నారు. రాబోయే తరాల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని పర్యావరణ హితమైన పవర్ ను ఉత్పత్తి చేసి అందించాలన్నారు. రాష్ట్రంలో ఏటేటా పెరుగుతున్న విద్యుత్తు డిమాండ్ ను దృష్టిలో పెట్టుకుని రాబోయే ఇరవై ఏళ్లకు సరిపడా విద్యుత్ ఉత్పత్తిని అందుకోవడానికి అవసరమైన ప్రణాళికలు రూపొందించాలని కోరారు. గ్రీన్ హైడ్రోజన్ , ఫ్లోటింగ్ సోలార్, రూఫ్ సోలార్ థర్మల్ పవర్ , పవన విద్యుత్తు, అణువిద్యుత్తు బ్యాటరీ స్టోరేజ్ లాంటి ప్రత్యామ్నాయ విద్యుత్ వినియోగాన్ని ఎక్కువ మొత్తంలో అభివృద్ధి చేసుకోవాలని సూచించారు.

# కవిత ధర్నా చేయాల్సిన అవసరం ఏముంది?

- పదేళ్లు అధికారంలో ఉన్నప్పుడు బీసీలు గుర్తు రాలేదా?
- ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి

**హైదరాబాద్, మహా:** బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితపై కాంగ్రెస్ పార్టీ నాయకుడు, భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి నిప్పులు చెరిగారు. ఆదివారం హైదరాబాద్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. కల్వకుంట్ల కవితకి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి కాస్తా ఘాటుగా కౌంటర్ ఇచ్చారు. రాజకీయంగా పబ్బం గడుపు కోవడానికే కవిత తపన పడుతోందని విమర్శించారు. ప్రజలను తప్పు దోవ పట్టించే ప్రయత్నం చేస్తోందంటూ కవితపై మండిపడ్డారు. బీసీ రిజర్వేషన్ బిల్లు ఆమోదం కోసం 72 గంటలు ధర్నా చేయాల్సిన అవసరం ఏముందంటూ కవితను ఆయన సూటిగా ప్రశ్నించారు. బీసీ రిజర్వేషన్ల పెంపుపై చేయాల్సిందంతా కాంగ్రెస్ పార్టీ చేస్తోందన్నారు. ఇంకేదైనా వేరే అంశంపై ధర్నా చేస్తే బాగుంటుందంటూ కవితకు ఈ సందర్భంగా ఆయన సూచించారు. కుల, మత ప్రాతిపాదికన ఓబీసీ కేటగిరి ఉండదని స్పష్టం చేశారు. వెనకబడిన కులాల వారిని ఓబీసీ జాబితాలో పెడుతారని గుర్తు చేశారు. గుజరాత్, యూపీ, మహారాష్ట్రలలో ముస్లింలు ఓబీసీ జాబితాలో ఉన్నారని వివరించారు.



# పాతికేళ్ల తర్వాత...!

పాతికేళ్ల క్రితం విడుదలైన 'లగాన్' సినిమా లొకేషన్స్‌కు వెళ్లారు బాలీవుడ్ నటుడు, దర్శక–నిర్మాత ఆమిర్ ఖాన్. ఆయన హీరోగా నటించిన తాజా హిందీ చిత్రం 'సితారే జమీన్ పర్'. జెనీలియా హీరోయిన్‌గా నటించిన ఈ సినిమాకు ఆర్ఎస్ ప్రసన్న దర్శకత్వం వహించగా, ఆమిర్ ఖాన్ నిర్మించారు. జూన్ 20న విడుదలైన ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా దాదాపు రూ. 300 కోట్లు సాధించి, సూపర్‌హిట్‌గా నిలిచింది.

ఈ ఆగస్టు 1 నుంచి 'ఆమిర్ ఖాన్ టాకీస్–జనతా కా థియేటర్' యూట్యూబ్ చానల్‌లో పే పర్ వ్యూ విధానంలో ఈ సినిమా స్ట్రీమింగ్ అవుతోంది. కాగా ఈ సినిమాను గుజరాత్‌లోని భుజ్ నగరానికి దగ్గర్లో ఉన్న కునారియా గ్రామ ప్రజలకు ఉచితంగా ప్రదర్శించారు ఆమిర్ ఖాన్. వారితో కలిసి ప్రేక్షకుడిగా ఆమిర్ ఖాన్ ఈ సినిమాను చూసి, స్క్రీనింగ్ అనంతరం మాట్లాడారు. అలాగే అక్కడి లొకేషన్స్‌లో 'లగాన్' సినిమా చిత్రీకరించిన విషయాలను ఆమిర్ ఖాన్ గుర్తు చేసుకున్నారు. అలాపాతికేళ్ల తర్వాత 'లగాన్' సినిమాను చిత్రీకరించిన లొకేషన్స్‌కు వెళ్లి ఆమిర్ ఖాన్ నాటి విశేషాలను అక్కడి ప్రజలతో పంచుకోవడం విశేషం.

## 36 ఏళ్ల తర్వాత రజనీ సినిమాకు

# ఏ సర్టిఫికెట్

చిత్రాలకు సెన్సార్ బోర్డు ఏ సర్టిఫికెట్ ఇచ్చిందంటే ఆ చిత్రాలను 12 ఏళ్ల లోపు పిల్లలు చూడడానికి థియేటర్లో అనుమతించరాదని అర్థం అనే విషయం తెలిసిందే. అయితే ఈ నిబంధనలను ఇప్పుడు పెద్దగా ఏ సినిమా థియేటర్ నిర్వాహకులు పాటించడం లేదన్నది వేరే విషయం. సాధారణంగా క్రైమ్, థ్రిల్లర్, హర్రర్ కథా చిత్రాలకు, హింసాత్మక సంఘటనలు అధికంగా ఉన్న చిత్రాలకు సెన్సార్ బోర్డు ఏ సర్టిఫికెట్ ఇస్తుంది. అదే సర్టిఫికెట్‌ను ఇప్పుడు రజనీకాంత్ తాజాగా కథానాయకుడు నటించిన కూలీ చిత్రానికి ఇవ్వడం గమనార్హం. లోకేష్ కనకరాజు దర్శకత్వంలో సన్ పిక్చర్స్ సంస్థ నిర్మించిన ఈ చిత్రంలో రజనీకాంత్‌తో పాటు బాలీవుడ్ సూపర్‌స్టార్ అమీర్‌ఖాన్, టాలీవుడ్ స్టార్ నాగార్జున, శాండిల్‌వుడ్ స్టార్ ఉపేంద్ర, ,క్రేజీ స్టార్ శ్రుతిహాసన్ ముఖ్యపాత్రలు పోషించారు. ఇక అదనపు ఆకర్షణగా పూజాహెగ్డే ఐటమ్ సాంగ్ ఉండనే ఉంది. కాగా అనిరుద్ సంగీతాన్ని అందించిన ఈ చిత్రం ఈనెల 14న ప్రపంచవ్యాప్తంగా తెరపైకి రావడానికి సిద్ధమవుతోంది.

ఇలాంటి పరిస్థితుల్లో కూలీ చిత్రానికి సెన్సార్ బోర్డు ఏ సర్టిఫికెట్‌ను ఇవ్వడం చర్చనీయంగా మారింది. కారణం ఈ చిత్రంలో భారీగా హింసాత్మక సన్నివేశాలు చోటు చేసుకోవడమే అని తెలిసింది. రజనీకాంత్ నటించిన అత్యధిక చిత్రాలు యూ /ఏ సర్టిఫికెట్ తోనే విడుదలయ్యాయి. అయితే 1982లో నటించిన పుదుకవిత్తై, రంగా, 1985లో నటించిన ఊరుక్కావాలన్, 1989లో నటించిన శివ చిత్రాలు మాత్రం ఏ సర్టిఫికెట్‌తో విడుదలయ్యాయి. ఇప్పుడు 36 ఏళ్ల తర్వాత మళ్లీ కూలీ చిత్రం ఏ సర్టిఫికెట్తో తెరపైకి రాబోతుందన్నది గమనార్హం. అయితే ఈ చిత్ర ట్రైలర్ ,ఆడియో ఆవిష్కరణ కార్యక్రమాన్ని శనివారం సాయంత్రం చైన్నెలోని నెహ్రూ హిందూ స్టేడియంలో భారీ ఎత్తున నిర్వహించారు.



'కమల్ హాసన్ కుమార్తె' అనే ఓ ప్రత్యేకమైన ట్యాగ్‌తోనే అందరికీ పరిచయం అయినా, శ్రుతి హాసన్ ఇప్పుడు ఆ పేరుకు మించి తనదైన గుర్తింపును ఏర్పరచుకుంది. త్వరలో రానున్న 'కూలీ' సినిమాలో ప్రధాన పాత్రలో కనిపించనుంది. చిన్ననాటి నుంచి మురుగన్ స్వామిని విశ్వసించే శ్రుతి, ఇటీవల వారాహీమాత భక్తురాలిగా మారింది. చెన్నైలోని ఓ చిన్న గుడికి వెళ్లిన తర్వాత తనలో భయాలు తగ్గాయని, జీవితంలో మానసిక ప్రశాంతతను పొందానని చెప్పింది. వారాహిమాతను పూజించడం ప్రారంభించిన తరువాత తన జీవితంలో అనేక మార్పులు చోటు చేసుకున్నాయని చెప్పింది. తనకు వచ్చిన తన తండ్రి కమల్ హాసన్ వాయిస్ కారణంగా కెరీర్ ప్రారంభంలో ఆమె చేసిన డబ్బింగ్, పాటలపై ట్రోల్స్ ఎక్కువైనా, నమ్మకాన్ని కోల్పోలేదట! ఏ ఆర్ రెహమాన్ సంగీతంపై చిరకాల

# నా భక్తి దారి వేరే అంటున్న శ్రుతి హాసన్

కోరిక. 'థగ్ లైఫ్'లో ఆయన సంగీత దర్శకత్వంలో పాట పాడుతున్నప్పుడు సంతోషంతో ఉక్కిరి బిక్కిరి అయ్యిందట! జాతకాలను గట్టిగా నమ్ముతుంది. ప్రస్తుతం కుజ మహాదశలో ఉందని చెప్పింది. స్నేహితురాలు సుకన్య జ్యోతిష్య శాస్త్రం మీద రాసిన పుస్తకం ద్వారా, ఆమె సలహాలు తీసుకుంటుందట! తండ్రి కమల్ హాసన్‌లో తనకు నచ్చిన క్వాలిటీ– ఆయన విల్ పవర్. తండ్రి అభిమాన దర్శకుడు అకిరా కురసోవా సినిమాలు చూసి, ఆయన జీవిత చరిత్ర చదివాక జపాన్ మీద ప్రత్యేకమైన అభిమానం పెంచుకుంది. తన జీవితంలో రెండు షేడ్స్ ఉన్నాయంటోంది శ్రుతి– ఒకటి ప్రజల కోసం, మరొకటి స్నేహితుల కోసం. మూడున్నరేళ్ల వయసులో పరిచయమైన ఫ్రెండ్‌తో ఇప్పటికీ స్నేహం కొనసాగుతుందట! బాల్యంలో తండ్రి కమల్ హాసన్, తల్లి సారిక– ఎవరికి వాళ్ళు చాలా బిజీగా ఉండేవారు. కమల్ హాసన్ ఏడెనిమిది గంటల పాటు స్క్రీన్ ప్లే రాసుకుంటుంటే, సారిక సినిమా సౌండ్ డిజైనింగ్ లో బిజీగా ఉండేది. తల్లిదండ్రులిద్దరూ స్కూల్‌కి వెళ్ళి చదువుకున్న వాళ్ళు కాదు. కాని, పిల్లల చదువు విషయంలో చాలా కఠినంగా ఉండేవారు. ఇంట్లో పూర్తిగా నాస్తిక వాతావరణం ఉండేది. ఇంట్లో పూజలు చేసేవారు కాదు. అయినా తన భక్తి దారి వేరే అని చెబుతుంది వంట అంటే మక్కువ, సౌత్ ఇండియన్ , ఇటాలియన్ వంటకాల్లో ప్రావీణ్యం. సాంబార్ రైస్, మటన్ సూప్, మోచీ ఐస్‌క్రీమ్– ఆమె ఫేవరెట్‌డిషెస్.



# శభాష్ ఖుషీ!



ఇండస్ట్రీలో రాణించాలంటే యాక్టింగ్ ప్రతిభతోపాటు స్క్రీన్‌పై ఫిట్‌గా కూడా కనిపించాల్సి ఉంటుంది. ఆ ఫిట్‌నెస్ కోసం కఠినమైన కసరత్తులు చేస్తుంటారు తారలు. ఇందులో భాగంగా వెయిట్ లిఫ్టింగ్ కూడా చేస్తుంటారు. అయితే ఓ అమ్మాయి ఓ వంద కేజీలు బరువు ఎత్తితేనే హాట్ టాపిక్ అయిపోతుంది. అలాంటిది ఖుషీ కపూర్ జిమ్‌లో ఏకంగా 290 కేజీల బరువును లిఫ్ట్ చేయడంతో చాలామంది షాక్ అయ్యారు. దివంగత ప్రముఖ తార శ్రీదేవి చిన్న కుమార్తె ఖుషీ కపూర్ హిందీ సినిమాలు చేస్తున్నారు. ఓ హీరోయిన్‌గా ఫిట్‌గా ఉండటం కోసం ఆమె వర్కౌట్స్ చేస్తుంటారు. ఈ క్రమంలోనే హిప్ థ్రస్ట్ వర్కౌట్‌లో భాగంగా 290 కిలోల బరువును ఖుషీ కపూర్ లిఫ్ట్ చేశారు. ఈ వీడియోను ఆమె తన ఇన్‌స్టా స్టేటస్‌లో షేర్ చేయగా వైరల్ అవుతోంది. ఈ వీడియోపై నెటిజన్లు, ఆమె సోషల్ మీడియా ఫాలోయర్స్ విభిన్నరకాలుగా కామెంట్స్ చేస్తున్నారు.

కొందరు శభాష్ ఖుషీ అని మెచ్చుకుంటుంటే, మరికొందరు ఈ ముద్దుగుమ్మకు ఎంత కష్టం వచ్చిందో అన్నట్లుగా కామెంట్స్ చేస్తున్నారు. ఇక ఖుషీ కపూర్ సినిమాలు ఎంపిక చేసుకునే విషయంలో చాలా పర్టిక్యులర్‌గా ఉంటున్నారట. మంచి మాస్ కమర్షియల్ సబ్జెక్ట్ లేదా డిఫరెంట్ క్యారెక్టర్స్ చేయడానికి ఆమె ఇష్టపడుతోందని రెగ్యులర్ లవ్‌స్టోరీ, గాళ్ నెక్స్ట్ డోర్... వంటివి చేసే ఆలోచన ప్రస్తుతానికి ఖుషీకి లేదని బాలీవుడ్‌లో ప్రచారం సాగుతోంది.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com